
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
ఆదివారం
23 ఆగస్టు 2026
పేజీలు : 08
Follow :



- ఎక్కడ చూసినా అవినీతి చర్చనే
- లక్షల్లో ""లంచాలు అంటూ సోషల్ మీడియాలో వైరల్
- అన్ని శాఖల్లో ఇదే తంతు
- న్యాయం ప్రక్కకు పచ్చనోటు ముందుకు
- నోటు మాటే వింటున్న అధికారులు
- కొందరు అధికారులపై వేటు పడుతున్న తీరుమారని వైనం






# షాద్‌నగర్‌లో అధికారుల భరి తెగింపు

## అవినీతి మచ్చ ఓవైపు.. నిర్లక్ష్యం మరోవైపు!

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో అవినీతి రాజ్యమేలుతుంది ఇది ఎవరో సామాన్యులు అంటున్న మాటలు కాదు చక్రంతిప్పే రాజకీయ నేతలే బహిరంగంగా చర్చించుకుంటున్నారు ఏ శాఖలో చూసిన ఏమున్నది గర్వ కారణం లక్షల్లో లంచాలు తప్ప అనే చర్చ నియోజకవర్గ వ్యాప్తంగా కోడై కూస్తుంది రెవెన్యూ శాఖనే కాదు ఏ శాఖ చూసిన ప్రతి శాఖలో పైసలు లేనిదే పని కావడం లేదనే విమర్శలు పెద్ద ఎత్తున ఎదుర్కొంటున్నారు అధికారులు.... పైసల్, పైసల్, పైసల్, ఎక్కడ చూసినా ఇదే చర్చ మరి ప్రభుత్వాధికారులకు జీతాలు ఎందుకు అనేది మరో ప్రశ్న రెవిన్యూ శాఖ పోలీస్ శాఖ కార్యాలయలలో కూడా ఇది తంతు కొనసాగుతుందనే చర్చ బహిరంగంగానే వినిపిస్తుంది కొందరు అధికారులు సివిల్ కేసులలో జోక్యం చేసుకొని సెటిల్మెంట్లు చేస్తున్నారనే ఆరోపణలు కూడ బలంగా వినిపిస్తున్నాయి ఇక రెవెన్యూ శాఖలో వందలది ఫైళ్లు తాహసిల్దార్ ఆర్డీవో కార్యాలయలలో పెండింగ్ లో ఉన్న సామాన్య ప్రజనికం తిరిగి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారే తప్ప వారి సమస్యలు మాత్రం పరిష్కారాలు కావడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి తాహసిల్దార్ కార్యాలయం మొదలుకొని ఆర్డిఓ కార్యాలయాల చుట్టూ తిరిగిన ఓ బాధితుడా రేపు రా అనే మాటలే తప్ప ఇప్పటికిప్పుడు పరిష్కారం చేసే యోచనలో అధికారులు లేరు దానికి కారణం చేతులు తడపనిదే పని కావడం లేదనే ఆరోపణ బలంగా వినిపిస్తుంది ప్రభుత్వ శాఖల అధికారులపై జిల్లా అధికార యంత్రాంగం ప్రజాప్రతినిధులు దృష్టి సారించకపోవడం వల్లనే మితిమీరిన అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటేనే సామాన్య జనం వనికిపోతున్నారు పోతే ఏంటి తమ సమస్య పరిష్కారం కాదు కదా అని లోపల కుమిలిపోతున్నారు..

జిల్లాలో ఓవైపు అవినీతి తిమింగలాలు ఏసీబీ దాడుల్లో లక్షల కోట్ల రూపాయల అక్రమస్తులలో లంచాలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడుతున్న అవినీతి మాత్రం ఆగడం లేదు ఈ మధ్యకాలంలో ఒకేసారి నలుగురు పోలీసు అధికారులు షాద్ నగర్ ప్రాంతం నుండి బదిలీలు కావడం బలమైన ఆరోపణలతోనే అయ్యారనే టాక్ వినిపిస్తుంది.




# ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఉపాధి కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో ఆటోవాలాలు
- ఈనెల 24న రాష్ట్రవ్యాప్త బంద్‌కు జేఏసీ పిలుపు
- 300 ఆటోలతో మల్లాపూర్ నుంచి నాచారం వరకు భారీ ర్యాలీ
- సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్

లోపలి పేజీలో



# పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే జీవో 97ను రద్దు చేయాలి

**పాలిటెక్నిక్, డిప్లమా కోర్సుల విలీనంపై విద్యార్థుల్లో ఆందోళన**

- ఫీజులు పెరిగితే పేద విద్యార్థులపై తీవ్ర ప్రభావం
- సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్తానని కూనంనేని హామీ
- జీవో ఉపసంహరించకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమం: ఏఐఎస్ఎఫ్

**హయత్‌నగర్, ఆగస్టు 22 (జనం సాక్షి):**

పేద, మధ్యతరగతి విద్యార్థులను సాంకేతిక, ఉన్నత విద్యకు దూరం చేసేలా ఉన్న జీవో నంబర్ 97ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్, డిప్లమా కోర్సులను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలనే నిర్ణయంతో వేలాది మంది విద్యార్థుల్లో ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భూక్యా వినోద్ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి వినతిపత్రం లోపలి పేజీలో

# అన్ని వయసుల వారికీ 'ఫిజికల్ లిటరసీ'

- 100 శాతం సాధనే లక్ష్యం: యంగ్ ఇండియా వర్సిటీ వీసీ కిషోర్ గోపీనాథన్
- చిన్నారుల నుంచి వృద్ధుల వరకు శారీరక చైతన్యంపై దృష్టి
- గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ క్రీడలకు ప్రోత్సాహం
- జిల్లాల్లో సమన్వయంతో కార్యక్రమాల అమలు






5

# అలియాబాద్ చౌరస్తాలో.. 'హిల్స్ ఆఫ్ చిక్మంగళూరు ఫిల్టర్ కాఫీ' ప్రారంభం

- ప్రారంభించిన అలియా బాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమటం శిరీష కృష్ణారెడ్డి
- ప్రారంభోత్సవానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్

# చట్టాలు చుట్టాలయ్యాయా?

## స్వాతంత్ర్య దినోత్సవం (డ్రైడే ) రోజు కూడా జోరుగా మద్యం విక్రయాలా?

- రామచంద్రపురంలో కల్లు దుకాణం మాటున అక్రమ అమ్మకాలు?
- హనుమాన్ దాబా వద్ద బహిరంగంగా మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు
- 'మినీ వైన్ షాప్'గా మారిందంటున్న స్థానికులు
- పోలీస్, ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్



5



# మూసీ నదిలో మృతదేహం

**అంబర్‌పేట్, ఆగస్టు 22 (జనంసాక్షి) :** అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో దుర్గా నగర్ డంపింగ్ యార్డ్ సమీపంలో గుర్తుతెలియని పురుషుని మృతదేహం ఉందన్న సమాచారం అందిన వెంటనే పోలీస్ వారు చేరుకుని పరిశీలించగా సుమారు 45 నుండి50 సంవత్సరాల వయసు కలిగిన కుళ్ళిన స్థితిలో లభించింది. మృతుడు నేవీ బ్లూ చెక్ షర్ట్ ధరించి, తల వెనుక భాగంలో పిలక కలిగి ఉన్నాడు. మృతుడు ఎవరన్నది ఇంకా నిర్ధారణ కాలేదు, పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన



**బంట్వారం ఆగస్టు 22 (జనం సాక్షి) :** బంట్వారం మండలం సల్బత్తాపూర్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో గ్రామస్తులు నీటి బిందెలతో రోడ్డుపై నిరసన చేపట్టారు. 40 ఏళ్లుగా తాగునీటి సమస్య కొనసాగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించకపోతే మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామని, మహిళలతో కలిసి అసెంబ్లీ, శాసనసభ్యుల క్యాంపు కార్యాలయం ముట్టడిస్తామని గ్రామ యువ నాయకుడు కావలి నర్సిములు హెచ్చరించారు.

# మిలాద్-ఉన్-నబీ వేడుకలు ప్రశాంతంగా నిర్వహించాలి : ఏసీపీ రాఘవేంద్రరావు

**అమీర్‌పేట్ (జనంసాక్షి) :** ఆగస్టు 26న జరగనున్న మిలాద్-ఉన్-నబీ వేడుకల నేపథ్యంలో బొరబండ పోలీస్ స్టేషన్‌లో ముస్లిం సోదరులతో ఏసీపీ రాఘవేంద్రరావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. అన్ని వర్గాల ప్రజలు పరస్పర సహకారం, సోదరభావంతో వ్యవహరించి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. పోలీస్ శాఖకు పూర్తిస్థాయిలో సహకరిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో బొరబండ ఇన్స్పెక్టర్ రవికుమార్ డిటేక్టివ్ స్పెక్టర్ సైదులు, ఎస్సైలు కాశి, మధుసూదన్, ముకుంద్ నాయక్, మల్లయ్య, భీంరావుతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సన్నా రకాలు కొనుగోలు చేసిన దానిని ఆన్‌లైన్‌లో ఎక్కించాలి

### శామీర్‌పేట్ ఏఓ రమేష్

**శామీర్‌పేట్, ఆగష్టు 22 (జనంసాక్షి) :** శామీర్ పేట్ మండలంలో నీ రైతులు తెలంగాణ ప్రభుత్వం సిఫార్సు చేసిన 7 సన్న రకాలు అనగా బీపీటీ, 5204, కెఎన్ఎం,1638, కె ఎన్ ఎం 7715, జై శ్రీరామ్ ,హెచ్ఎంటి డబ్లు ల్యూ 44, తెలంగాణ సోనా ఎవరైనా రైతులు ఈ రకాలు వేసినట్లయితే విత్తనం కొనుగోలు చేసిన డీలర్స్ వద్ద ఆన్లైన్ లో నమోదు చేసుకోవాలి. ఒక వేళ సొంతంగా ఇతర మార్గాల ద్వారా ఎవరైనా వేస్తే వారు అలియాబాద్ రైతు వేదిక లో స్వీయ ధ్రువీకరణ పత్రం వచ్చే నెల 10 లోపు నమోదు చేసుకోవాలన్నారు.ఈ పంట ఆన్లైన్ లో ఉంటే నే ప్రభుత్వ బోనస్ లభిస్తుందని తెలిపారు.

# మేడిపల్లి పెరుమాండ్ల హనుమాన్ ఆలయం వద్ద అన్న ప్రసాదం



యాచారం, ఆగస్టు 22 (జనంసాక్షి) : యాచారం మండల పరిధిలోని నక్కర్త మేడిపల్లి గ్రామ శివారులో ఉన్న పెరుమాండ్ల ఆంజనేయస్వామి దేవాలయం వద్ద శనివారం పి ఆర్ జి ఫౌండేషన్ అధ్యక్షులు ప్రొద్దుటూరి రవీందర్ గుప్త ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అభిషేకం నిర్వహించి అన్న ప్రసాద కార్యక్రమం రవీందర్ గుప్త తండ్రి ప్రొద్దుటూరి వెంకన్న గుప్త జ్ఞాపకార్థం అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండాలని కోరుకున్నారు.ఆంజనేయ స్వామి ఆలయం పునః నిర్మాణం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మేడిపల్లి విశ్రాంతి ఉపాధ్యాయులు బొగ్గుల పాపిరెడ్డి, బిజెపి నాయకులు కునిరెడ్డి అచ్చి రెడీ, కడ్తల్ ఎస్ టి సెల్ మండల అధ్యక్షుడు శ్రీను నాయక్, పలేచెల్కతండ మాజీ సర్పంచ్ లోక్య నాయక్, మాజీ ఉప సర్పంచ్ సీతారాం నాయక్, నవీన్ నాయక్,వార్డు సభ్యులు మోతీలాల్, రాజు నాయక్,పాండు నాయక్ ,బాపూజీ, నారియా నాయక్, గోపాల్ నాయక్, బాదు బావోజి, బిజెపి టపాస్ బాలు నాయక్ తదితరులు ఉన్నారు.

# మటన్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలి

### పెంపకదారులకు రూ.2 లక్షల రుణాలు విడుదల చేయాలి
### చెంగిచెర్లలో ఘనంగా గొర్రెలు, మేకల పెంపకదారుల 4వ రాష్ట్ర మహాసభలు



**బోడుప్పల్, ఆగస్టు 22 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం (జీఎంపీఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 4వ రాష్ట్ర మహాసభలు శుక్రవారం చెంగిచెర్లలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ మహాసభలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి గొర్రెలు, మేకల పెంపకదారులు, సంఘ నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మహాసభల సందర్భంగా చెంగిచెర్ల మండీ నుంచి జీజీఆర్ ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సంఘ జెండాను ఆవిష్కరించి మహాసభలను అధికారికంగా ప్రారంభించారు. జీఎంపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కిల్లె గోపాల్, ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ మాట్లాడుతూ గొర్రెలు, మేకల పెంపకం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉందన్నారు. పెంపకదారుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం వెంటనే రూ.2 లక్షల వడ్డీ రాయితీ రుణాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పశుపోషకులకు సులభతరమైన రుణాలు అందించి ఆర్థికంగా అండగా నిలవాలని కోరారు. తెలంగాణలో రాజస్థాన్ తరహాలో మటన్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



**వీధి కుక్కల దాడులతో తీవ్ర నష్టం**

గొర్రెలు, మేకల పెంపకదారులను వీధి కుక్కల దాడులు తీవ్రంగా నష్టపరుస్తున్నాయని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కుక్కల దాడుల్లో వందలాది గొర్రెలు, మేకలు మృతి చెందడంతో పెంపకదారులు లక్షల రూపాయల నష్టాన్ని చవిచూస్తున్నారని తెలిపారు. కుక్కల దాడుల్లో మృతి చెందిన పశు వులకు ప్రభుత్వం ప్రత్యేక నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. గతంలో అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన అవకతవకలను అరికట్టి, అర్హులైన లబ్ధిదారులకు కొత్త విడతలో గొర్రెల యూనిట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభల అనంతరం నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు వెల్లడించారు.

# వైన్స్ వద్ద అస్వస్థతకు గురై వ్యక్తి మృతి



**హయత్‌నగర్, ఆగస్టు 22 (జనం సాక్షి) :** ఈశ్వరమ్మ కాంప్లెక్స్ సమీపంలో స్వాతి వైన్స్ వద్ద అస్వస్థతకు గురైన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం ఉదయం సుమారు 7:30 గంటల సమయంలో స్వాతి వైన్స్ ముందు ఓ వ్యక్తి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నట్లు 100 నంబర్‌కు సమాచారం అందింది. వెంటనే వనస్థలిపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది సదరు వ్యక్తిని వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ఉన్న సమయంలో అతను తన పేరు శ్రీనివాస్ అలియాస్ శ్రీను (57), తండ్రి పేరు సుబ్బారావు, స్వస్థలం గుడివాడ, ఆంధ్రప్రదేశ్ అని తెలిపినట్లు పోలీసులు పేర్కొన్నారు. అతడి ముఖం ఉబ్బి ఉండటంతో పాటు దవడ, కంటి భాగంలో గాయాలున్నాయి. గాయాలపై పోలీసులు ప్రశ్నించగా రోడ్డుపై పడిపోవడంతో గాయాలయ్యాయని తెలిపినట్లు సమాచారం. చికిత్స పొందుతూ ఉదయం 9:10 గంటలకు శ్రీనివాస్ మృతి చెందాడు. ఈ ఘటనపై హెడ్ కానిస్టేబుల్ రాజేందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతికి గల కారణాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

**మృతుడి ఆనవాళ్లు**

మృతుడు చామన ఛాయతో సుమారు 5.5 అడుగుల ఎత్తు, తెల్ల గడ్డం, తెల్ల మీసాలు కలిగి ఉన్నాడు. సంఘటన సమయంలో లేత నీలిరంగు చొక్కా, నీలిరంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే వనస్థలిపురం పోలీసులను సంప్రదించాలని కోరారు.

# పాత దేవతా విగ్రహాలకు గౌరవప్రద ఉద్వాసన



**అల్వాల్, ఆగస్టు 22(జనంసాక్షి):** జీహెచ్ఎంసీ చేపట్టిన 'ప్రాజెక్ట్ ఉద్వాసన'లో భాగంగా అల్వాల్ సర్కిల్ మచ్చబొల్లారంలోని శ్రీ మహంకాళి దేవాలయంలో శనివారం కార్యక్రమం నిర్వహించారు. పాత దేవతా విగ్రహాలు, చిత్రపటాలను చెత్తకుప్పలు, చెరువుల్లో పడేయకుండా గౌరవప్రదంగా సేకరించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటమే కార్యక్రమం ఉద్దేశమని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ భోగేశ్వర్లు, ఆలయ చైర్మన్ శ్రవణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భోగేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలు, సంప్రదాయాలకు గౌరవం కల్పిస్తూనే పర్యావరణానికి హాని కలగకుండా పాత దేవతా విగ్రహాలు, చిత్రపటాలను శాస్త్రోక్తంగా సేకరిస్తున్న సిబ్బందిని అభినందించారు. పాత విగ్రహాలు, చిత్రపటాలను నిర్లక్ష్యంగా పడేయకుండా గౌరవప్రదంగా అప్పగించేందుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. ప్రజల మనోభావాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు గౌరవం కల్పించడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడమే 'ప్రాజెక్ట్ ఉద్వాసన' లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ అధికారులు కృష్ణమోహన్, కౌసర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మూడేళ్ల నొప్పికి ముగింపు

### అరుదైన శస్త్రచికిత్సతో 5 కిలోల గర్భాశయ కణితి తొలగింపు
### రాంపల్లిలోని జె.ఆర్.రెడ్డి లైన్స్ క్లబ్ ఆస్పత్రి వైద్యుల ఘనత



**కీసర (జనంసాక్షి) :** మూడేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్న ఓ యువతికి జె.ఆర్.రెడ్డి లైన్స్ క్లబ్ ఆస్పత్రి వైద్యులు ఉపశమనం కల్పించారు. ఆమె గర్భాశయంలో పెరిగిన 5 కిలోల బరువున్న భారీ కణితిని విజయవంతంగా తొలగించి కొత్త జీవితం ప్రసాదించారు. నాగారం డివిజన్ రాంపల్లిలోని ఆర్ఎల్ నగర్‌కు చెందిన యువతి చాలా కాలంగా కడుపునొప్పితో ఇబ్బందులు పడుతోంది. ఇటీవల సమస్య మరింత తీవ్రం కావడంతో జె.ఆర్.రెడ్డి లైన్స్ క్లబ్ ఆస్పత్రిని ఆశ్రయించింది. వైద్యులు అల్ట్రాసౌండ్ స్కానింగ్ నిర్వహించగా గర్భాశయంలో భారీ కణితి ఉన్నట్లు గుర్తించారు. దీంతో సీనియర్ సర్జన్ డాక్టర్ రమేష్ నేతృత్వంలోని వైద్య బృందం శుక్రవారం దాదాపు రెండు గంటలపాటు శస్త్రచికిత్స నిర్వహించింది. అనంతరం 5 కిలోల బరువున్న కణితిని విజయవంతంగా తొలగించింది. తొలగించిన కణితిని కుటుంబ సభ్యులకు చూపించి బయాప్సీ పరీక్షల కోసం ప్రయోగశాలకు పంపించారు. ప్రస్తుతం యువతిని ఐసీయూలో ఉంచి వైద్య పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదిస్తే ఇలాంటి సమస్యలను అధిగమించవచ్చని డాక్టర్ రమేష్, డాక్టర్ వినయ్ కుమార్ గౌడ్ సూచించారు.

## ఘనంగా మాజీ కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్ జన్మదిన వేడుకలు

### ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ



**కొడంగల్, ఆగస్టు 22 (జనం సాక్షి):** కొడంగల్ మాజీ శాసనసభ్యులు పట్నం నరేందర్ రెడ్డి సన్నిహితులు, కొడంగల్ మున్సిపల్ రెండో వార్డు మాజీ కౌన్సిలర్ ఆర్. మధుసూదన్ యాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఆయన సోదరుడు ఆర్. శ్రీమాన్ రావు ఆధ్వర్యంలో శనివారం నివాసంలో కేక్ కట్ చేసి,పటాకులు కాల్చి అభిమానులు కార్యకర్తలు, కాలనీవాసులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వి. రవీంద్రచారి, రవీందర్ గౌడ్, తలారి వెంకట్ ముదిరాజ్, బాపనగిరి మోహన్, బండి గోపాల్, సమరసింహారెడ్డి, మోహన్, పాశం కృష్ణ, పాశం వెంకట్, పాశం సత్యప్ప,అనిల్ కుమార్, సల్కంపేట మోహన్, డి. శ్రీను, సి. శ్రీను, పాశం సాయి, కే. రాకేష్, యస్. అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## 31 మందికి ఉచితంగా కళ్లద్దాల పంపిణీ



**అల్వాల్, ఆగస్టు 22 (జనంసాక్షి):** అల్వాల్‌లో ఇటీవల నిర్వహించిన మెగా ఆరోగ్య శిబిరంలో దృష్టి లోపాలు ఉన్నట్లు గుర్తించిన 31 మందికి లయన్స్ క్లబ్ ఆఫ్ అల్వాల్ ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. శిబిరంలో నిర్వహించిన నేత్ర పరీక్షల ఆధారంగా లబ్ధిదారులకు అవసరమైన కళ్లద్దాలను తయారు చేయించి అందజేశారు. పేదలకు మెరుగైన నేత్ర వైద్యం, సంరక్షణ అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆరోగ్య శిబిరాల్లో గుర్తించిన సమస్యలకు తదుపరి చికిత్స, అవసరమైన సేవలను అందించేందుకు లయన్స్ క్లబ్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు జయంతి, సత్యనారాయణరావు, వెంకటరమణ, రవీందర్, కోటేశ్వరరావు, ప్రమీలకుమార్, జేఏసీ నాయకుడు సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కూలీకి పిలిచి.. బంగారం దోచి

**48గంటల్లో ఛేదించిన పోలీసులు**
**12 గ్రాముల బంగారు గొలుసు స్వాధీనం**
**ఆదిభట్ల ఏసీపీ ప్రదీప్ కుమార్ రెడ్డి వివరాలు వెల్లడి**



**రంగారెడ్డి, ఆగస్టు 22 (జనంసాక్షి)**

కూలీ పనుల కోసం రమ్మని నమ్మించి, మహిళ మెడలోని బంగారు గొలుసును అపహరించిన నిందితుడిని ఆదిభట్ల పోలీసులు కేవలం 48 గంటల్లోనే అరెస్టు చేశారు. ఈ మేరకు ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించిన వివరాలను ఆదిభట్ల పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ ప్రదీప్ కుమార్ రెడ్డి వివరాలు వెల్లడి వెల్లడించారు. అందుకు సంబంధించిన వివరాలు.. రంగారెడ్డి జిల్లా, సరూర్‌నగర్ మండలం, హస్తినాపురంలో నివాసం ఉంటున్న చందూరు మండల జోగుగూడెం గ్రామానికి చెందిన వట్టి మంగమ్మ (56) అనే మహిళ ఆగస్టు 20న ఉదయం 8:30 గంటల సమయంలో ఎన్‌జీఓస్ కాలనీలోని కూలీల అడ్డ వద్దకు పని కోసం వెళ్లింది. అదే సమయంలో అక్కడకు వచ్చిన గజ్జ విజయ్ కుమార్ గౌడ్ (37) అనే మేస్త్రి మన్నెగూడలో పని ఉందని, రోజువారీ కూలి రూ.900 ఇస్తానని నమ్మించి తన మోటార్ సైకిల్‌పై ఎక్కించుకున్నాడు. ఇదిలా ఉండగా, మన్నెగూడ మొదటి రింగ్ రోడ్డు మీదుగా ఆదిభట్ల వైపు వచ్చే సర్వీస్ రోడ్డు పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలోకి తీసుకెళ్లాడు. అక్కడ గడ్డి పీకాలని చెప్పి, సిమెంట్ తీసుకొస్తానని నమ్మించి కొద్దిసేపటికి మళ్లీ వచ్చి ఆమె నోరు మూసి, మెడలో ఉన్న సుమారు 12 గ్రాముల నల్లపూసల బంగారు గొలుసును బలవంతంగా లాక్కొని బైక్‌పై పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆదిభట్ల ఇన్‌స్పెక్టర్ ఎస్. రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు చేపట్టిన దర్యాప్తులో భాగంగా, ఆగస్టు 22న బొంగులూరులోని ఒక బంగారు దుకాణం వద్దకు దొంగిలించిన బంగారం విక్రయించడానికి వస్తున్న నిందితుడిని సీసీ కెమెరాల సహాయంతో గుర్తించారు. ఉదయం 11:30 గంటలకు ఇన్‌స్పెక్టర్ ఎస్. రమేష్, ఎస్‌ఐ ఎన్. నోయెల్ రాజ్, వారి సిబ్బంది నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. చెడు అలవాట్లకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతోనే ఈ నేరానికి పాల్పడినట్లు తెలిపాడు. నిందితుడి నుండి 12 గ్రాముల బంగారు గొలుసుతో పాటు నేరానికి ఉపయోగించిన హీరో స్ప్లెండర్ టీజీ 07ఎం 5709 బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును కేవలం 48 గంటల్లో విజయవంతంగా ఛేధించిన ఇన్‌స్పెక్టర్ ఎస్. రమేష్, ఎస్‌ఐ ఎన్. నోయెల్ రాజ్, హెడ్ కానిస్టేబుల్ రవి కుమార్, కానిస్టేబుల్స్ కిరణ్ రెడ్డి, ఎల్లయ్య, ఉపేందర్, శివ చంద్ర, భరత్‌ల టీమ్‌ను ఏసీపీ డి.వి. ప్రదీప్ కుమార్ రెడ్డిని సీఐ రమేష్ అభినందించారు. సీసీ కెమెరాల సహాయంతోనే ఈ కేసును త్వరగా ఛేధించేందుకు అవకాశం ఏర్పడిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ తమ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ మీడియా సమావేశంలో ఆదిభట్ల సీఐ రమేష్, ఎస్‌ఐ సుందరయ్య ఉన్నారు.

## ఓటు హక్కు కోల్పోయినట్లు కాదు.. ఆధారాలతో వివరాలు సరిచేసుకోవచ్చు: డాక్టర్ కోట నీలిమ

**అమీర్పేట, "ఆగస్టు 22 (జనంసాక్షి) :** పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ ఆధ్వర్యంలో SIR ఫేజ్--2లో భాగంగా SR నగర్ 189, 190, 191, అమీర్‌పేట్ 153, 154, 155, సనత్‌నగర్ 164, 214, 215, బీకే గూడ 198, 199, 202, 204, 205 బూత్‌ల పరిధిలో ఏఎస్‌డీడీ (ASDD) లిస్ట్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కోట నీలిమ, దీపక్ జాన్‌తో కలిసి ఆయా బూత్‌ల పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఏఎస్‌డీడీ లిస్ట్‌లో పేర్లు నమోదైన ఓటర్ల వివరాలను పరిశీలించారు. కుటుంబ సభ్యులతో నేరుగా మాట్లాడి, వారి పేర్లు జాబితాలో చేరడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వివరాల్లో



ఏదైనా తప్పిదం లేదా సమాచార లోపం కారణంగా పేరు ఏఎస్‌డీడీ లిస్ట్‌లో చేరిందా అనే అంశంపై ఆరా తీసి, ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పించారు.

# నేడే బోడుప్పల్‌లో శ్రీబంగారు మైసమ్మ బోనాలు

### సర్వాంగసుందరంగా ముస్తాబైన అమ్మవారి ఆలయం.. భక్తుల కోసం భారీ ఏర్పాట్లు

**బోడుప్పల్-జనంసాక్షి :**

బోడుప్పల్‌లో ఆషాఢమాస బోనాల వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని బోడుప్పల్‌లోని శ్రీబంగారు మైసమ్మ అమ్మవారి ఆలయాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. అమ్మవారు కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా పరిసర ప్రాంతాల ప్రజల్లో విశేషమైన విశ్వాసం నెలకొంది. ప్రతి ఏటా బోనాల పండుగ సందర్భంగా వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని బోనాలు, వడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీబంగారు మైసమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారు చతుర్ముఖాలతో స్వయంభూగా వెలిశారని స్థానికులు చెబుతుంటారు. గ్రామ పెద్దకు అమ్మవారు కలలో కనిపించి తాను ఇక్కడే కొలువుదీరి ప్రజల కష్టాలను తీరుస్తానని చెప్పడంతో ఆలయ ప్రాశస్త్యం మరింత పెరిగిందని పేర్కొంటున్నారు. నాటి నుంచి అమ్మవారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయని, కోరిన కోర్కెలు తీరిన భక్తులు ప్రతి ఏటా బోనాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని



మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు. గత ఏడాది బోనాల సందర్భంగా సుమారు రెండు లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని, ఈసారి భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే పండుగకు ముందు రోజు నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బోనాలు సమర్పిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

**ప్రముఖుల రాక**

ఆదివారం జరిగే బోనాల ఉత్సవాలకు రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, లక్ష్మణ్‌తో పాటు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తదితర ప్రముఖులు హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

**భారీ పోలీసు బందోబస్తు**

బోనాల వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఆలయ పరిసరాలతో పాటు బోడుప్పల్‌లోని సున్నిత ప్రాంతాల్లో భారీగా పోలీసులను మోహరించారు. మేడిపల్లి సీఐ జలంధర్‌రెడ్డి నేతృత్వంలో బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ బొబ్బాల లక్ష్మారెడ్డి, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ఆధ్వర్యంలో అవసరమైన ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు నియంత్రిస్తూ త్వరితగతిన అమ్మవారి దర్శనం జరిగేలా పోలీసులు, ఉత్సవ కమిటీ వాలంటీర్లు సమన్వయంతో పనిచేయనున్నారు.

**ప్రశాంతంగా ఉత్సవాలు నిర్వహించేందుకు సహకరించాలి**

బోనాల ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆలయ కమిటీ చైర్మన్ బొబ్బాల లక్ష్మారెడ్డి కోరారు. ఈసారి భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. భక్తులు ఆలయ కమిటీ సూచనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని కోరారు. బోనాల ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు.




పదకొండు సంవత్సరాల క్రితం బీపీ, మధుమేహంతో బాధపడుతున్న పలువురు సరైన వైద్య పర్యవేక్షణకు దూరంగా ఉన్న విషయాన్ని జన విజ్ఞాన వేదిక గుర్తించింది. ఆర్థిక ఇబ్బందులతో పరీక్షలు చేయించుకోలేని వారు.. వ్యాధి ఉన్నా తెలియని వారు.. మందులు క్రమం తప్పకుండా వాడలేని వారు ఎందరో ఉన్నారని గుర్తించి ఉచిత వైద్య శిబిరాలకు శ్రీకారం చుట్టింది. అప్పటి నుంచి ప్రతి నెలా పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన వారికి వైద్యుల సలహాలు, మందులు అందిస్తోంది.

# ఒకరి ఆరోగ్యం.. ఓ కుటుంబానికి భరోసా

**11 ఏళ్లుగా పేదలకు ఉచిత వైద్య సేవలు**

- 132వ నెలలోకి అడుగుపెట్టిన జన విజ్ఞాన వేదిక సేవా ప్రస్థానం
- మానవీయతతో ఆరోగ్య చైతన్యాన్ని పంచుతున్న జేవీవీ



జేబులో డబ్బుల్లేక వైద్య పరీక్షలు చేయించుకోలేని పరిస్థితి.. బీపీ ఉందో, షుగర్ ఉందో తెలియక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలు.. అనారోగ్యం ముదిరిన తర్వాత ఆస్పత్రులకు పరుగులు పెట్టే బాధలు.. ఇలాంటి పరిస్థితుల్లో ఒక ఉచిత వైద్య పరీక్ష పేద కుటుంబానికి ఎంతో విలువైన భరోసా. ఇదే మానవీయ ఆలోచనతో జన విజ్ఞాన వేదిక ప్రారంభించిన బీపీ షుగర్ ఉచిత వైద్య శిబిరం 11 ఏళ్లుగా నిరంతరంగా కొనసాగుతోంది. ఇప్పుడు 12వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది.

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగష్టు 22 (జనంసాక్షి)**




**సేవకు తోడుగా నిలిచిన పాఠశాల**

కాప్రా సర్కిల్ చక్రిపురంలోని శ్రీ చక్రి విద్యానికేతన్ హైస్కూల్ ఈ సేవా కార్యక్రమానికి వేదికగా నిలిచింది. పాఠశాల కరస్పాండెంట్ ములుగు ప్రతాప్‌రెడ్డి సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి శిబిరాల నిర్వహణకు పాఠశాల ప్రాంగణాన్ని అందుబాటులో ఉంచారు. దాతలు, వైద్యులు, వాలంటీర్లు కూడా తమవంతు సహకారం అందిస్తూ 11 ఏళ్లుగా ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

**నేడు 132వ నెల మెగా శిబిరం**

జన విజ్ఞాన వేదిక కాప్రా, కీసర, మల్కాజిగిరి మండల కమిటీల ఆధ్వర్యంలో, యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్ సహకారంతో ఆదివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు చక్రిపురం క్రాస్‌రోడ్డులోని శ్రీ చక్రి విద్యానికేతన్ హైస్కూల్‌లో 132వ నెల మెగా బీపీ--షుగర్ వైద్య శిబిరం నిర్వహించనున్నారు. జనరల్ మెడిసిన్, గుండె సంబంధిత పరీక్షలు, ఈసీజీ, ఎముకలు కీళ్ల పరీక్షలు, బీపీ,షుగర్ పరీక్షలతో పాటు దంత, కంటి పరీక్షలు నిర్వహించనున్నారు. వైద్యుల సూచన మేరకు అవసరమైన మందులు కూడా అందించనున్నారు.



**ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు : ఎం.శ్రీనివాస్**

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీపీ, మధుమేహం వంటి వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే కుటుంబంపై ఆర్థిక, మానసిక భారం పెరుగుతుందని అన్నారు. వ్యాధి ముదిరిన తర్వాత బాధపడటం కంటే ముందుగానే పరీక్షలు చేయించుకోవడం మంచిదన్నారు. పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడంతో పాటు ప్రతి కుటుంబంలో ఆరోగ్య చైతన్యం పెంచడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యమని తెలిపారు.

**ప్రతి ఒక్కరికీ వైద్యం అందాలి : నాగరాజు**

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి పి.నాగరాజు మాట్లాడుతూ.. డబ్బుల కొరతతో ఎవరూ వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ శిబిరాలను నిర్వహిస్తున్నామని అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు బీపీ, షుగర్ పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. వైద్యుల సలహా మేరకు మందులు వాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించే ఈ సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని తెలిపారు.

**దాతల సహకారంతో సేవలు కొనసాగిస్తున్నాం : తోట శ్రీనివాస్**

జన విజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తోట శ్రీనివాస్ మాట్లాడుతూ.. 11 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలకు పలువురు ప్రొఫెసర్లు, విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, రాజకీయ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మేయర్లు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, వైద్యులు, రిటైర్డ్ ఉద్యోగులు, కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, అధికారులు, అనాధికారులు హాజరై తమ సహకారం అందించారని తెలిపారు. దాతల అండతోనే శిబిరాలను నిరంతరంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ జన విజ్ఞాన వేదిక తరపున కృతజ్ఞతలు తెలిపారు.

**భవిష్యత్‌లో మరిన్ని**

ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు. శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని మెడికల్ క్యాంప్ ఆర్గనైజర్ జి.కరుణాకర్ రెడ్డి చెప్పారు.

**ఒకరి ఆరోగ్యం కాపాడితే..**

ఒక కుటుంబం నిలబడుతుంది. ఈ ఆలోచనతో 11 ఏళ్లుగా జన విజ్ఞాన వేదిక కొనసాగిస్తున్న వైద్య సేవలు ప్రజారోగ్యంతో పాటు మానవీయ విలువలకు కూడా ప్రతీకగా నిలుస్తున్నాయి.



# ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




**నాచారం, ఆగస్టు 21 (జనం సాక్షి):** ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్ల జీవితాలతో ఆటలాడే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 24న తెలంగాణవ్యాప్తంగా ఆటో, యాప్ ఆధారిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బంద్‌ను విజయవం తం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఉప్పల్ నియోజక వర్గం మల్లాపూర్‌లో శనివారం సుమారు 300 ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎలిఫెంట్ సర్కిల్ నుంచి నాచారం వరకు సాగిన ర్యాలీలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా వేముల మారయ్య మాట్లాడుతూ ఆటో, క్యాబ్ డ్రైవర్లు తమ వాహనాలపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారని, ప్రస్తుతం ఆదాయం తగ్గిపోవడంతో కుటుంబ అవసరాలు తీర్చలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ఫైనాన్సర్ల ఒత్తిళ్లు, మరోవైపు ఉచిత బస్సు సౌకర్యం కారణంగా ప్రయాణికులు తగ్గిపోవడంతో ఆటో కార్మికుల ఉపాధి తీవ్రంగా దెబ్బతిన్నదన్నారు. కుటుంబాలను పోషించలేక అనేక మంది తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్మికుల పరిస్థితిని ప్రభుత్వం గుర్తించి తక్షణమే ఉపశమన చర్యలు చేపట్టాలని కోరారు.

ఆర్టీసీకి ఈ-ఆటోలను అందించే ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని మారయ్య డిమాండ్ చేశారు. ఆటో రవాణా రంగ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలను పెంచాలని కోరారు. ఓలా, ఉబర్, రాపిడో వంటి యాప్‌లకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్‌ను ఏర్పాటు చేయాలని, ఆయా యాప్‌ల ద్వారా అక్రమంగా నడుస్తున్న టూ వీలర్లను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందించాలని కోరారు. రోజువారీ ప్రయాణికులకు రవాణా సౌకర్యం కల్పిస్తున్న ఆటో డ్రైవర్లను ఈ-చలాన్ల నుంచి మినహాయించాలని, జీవో నంబర్ 263లో మిగిలిన అంశాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఇతర జిల్లాల నుంచి అక్రమంగా నడుస్తున్న ఆటోలను నియంత్రించాలని, వాహన సారథి పోర్టల్‌లో ఆటో డ్రైవింగ్ లైసెన్స్ కొనసాగించాలని కోరారు. రవాణా వాహనాలకు రేడియం స్టిక్కర్‌కు సంబంధించి జీవో నంబర్ ఎంఎస్ 60లో ఆటోలకు మినహాయింపు ఇవ్వాలని తెలిపారు. ప్రమాదాలకు గురయ్యే ఆటో డ్రైవర్లకు బీమా సౌకర్యాన్ని కొనసాగించాలని కోరారు.

ఆటో కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని మారయ్య తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి అక్కి రామాంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ పాండు నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాతం రమేష్, గోపాల్‌తోపాటు ఆటో కార్మిక నాయకులు అనిల్, రాములు, రహీం నాయక్, భూపతి, అశోక్, నాగరాజుగౌడ్, బాలరాజు, బాలు, హనుమంతు, రమేష్, పోలే రమేష్, శీను, తమిళ్ తదితరులు పాల్గొన్నారు.

# అలియాబాద్ చౌరస్తాలో..
# 'హిల్స్ ఆఫ్ చిక్మంగళూరు ఫిల్టర్ కాఫీ' ప్రారంభం

**శామీర్‌పేట, ఆగస్టు 22 (జనం సాక్షి) :** అలియాబాద్ చౌరస్తా వద్ద 'హిల్స్ ఆఫ్ చిక్మంగళూరు ఫిల్టర్ కాఫీ' హోటల్ ను అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమటం శిరీష కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. హోటల్ నిర్వాహకులు రెడ్డి నరేందర్ రెడ్డి, అరుణ్ కుమార్, బాలాజీ నూతనంగా ఏర్పాటు చేసిన హోటల్ ను శుక్ర వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఇలాంటి చక్కని హోటల్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. శుభ్రత పరిశుభ్రతతో రుచికరమైన, నాణ్యమైన వంటకాలను వినియోగదారులకు అందించి మంచి పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు. అంచలంచలుగా ఎదిగి ఇలాంటి హోటల్ బ్రాంచ్ లను మరిన్ని నెలకొల్పాలని కోరుకున్నారు. హోటల్ ప్రారంభోత్స కార్యక్రమానికి మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలతి మాధవరెడ్డి, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, శ్రేయోభిలాషులు, బంధువులు పాల్గొన్నారు.

# చట్టాలు చుట్టాలయ్యాయా...?




స్వాతంత్ర్య దినోత్సవం రోజు మద్యం అమ్మకాలు

- డ్రై డే నిబంధనలకు తూట్లు పొడిచిన హనుమాన్ దాబా నిర్వాహకులు
- కొందుర్గు మండలంలో జోరుగా సాగిన బెల్టుషాపు దందా
- అధికారుల మౌనమా .. లేక చూసీచూడనట్లు వదిలేశారా?
- అధికారుల మౌనంపై స్థానికుల అనుమానాలు

**కొందుర్గు, ఆగస్టు 21 (జనం సాక్షి):** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం డ్రైడే అమలు చేసినప్పటికీ కొందుర్గు మండలంలోని రామచంద్రపురం గ్రామంలో మద్యం విక్రయాలు కొనసాగా యనే ఆరోపణలు వెల్లువెత్తుతు న్నాయి. స్థానిక హనుమాన్ దాబా వద్ద, అలాగే ఓ కల్లు దుకాణం మాటున మద్యం విక్రయాలు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. సాధారణ రోజులతో పోలిస్తే ఆగస్టు 15న మద్యం కొనుగోలుదారుల రద్దీ ఎక్కువగా కనిపించిందని వారు పేర్కొంటున్నారు.

కల్లు దుకాణం పేరుతో నిర్వహిస్తున్న కేంద్రంలో వైన్, ఇతర మద్యం విక్రయిస్తున్నారని, దీంతో అది క్రమంగా 'మినీ వైన్ షాప్'గా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రైడే నిబంధనలు అమల్లో ఉన్న రోజున కూడా బహిరంగంగా మద్యం విక్రయాలు సాగడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తూ విక్రయాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన డ్రైడే నిబంధనలను ఉల్లంఘించి మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పోలీస్, ఎక్సైజ్ శాఖలపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలపై గతంలోనూ ఫిర్యాదులు ఉన్నప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని వారు ఆరోపిస్తున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అక్రమ విక్రయాలను అరికట్టాలని కోరుతున్నారు.

ప్రత్యేక రోజుల్లోనూ నిబంధనలు అమలు కాకపోతే ప్రభుత్వ ఆదేశాలకు విలువ లేకుండా పోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామచంద్రపురంలో మద్యం విక్రయాలపై సమగ్ర విచారణ చేపట్టి, నిజానిజాలను నిర్ధారించాలని, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# అక్కంపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కొత్త వెంకటయ్య నియామకం



**యాలాల అగస్టు 22(జనంసాక్షి) :** యాలాల మండలం అక్కంపల్లి గ్రామంలో శనివారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మరియు కార్యవర్గ సభ్యుల ఎంపిక కార్యక్రమం ఘనంగా జరిగింది. యాలాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహిపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఏకగ్రీవంగా అక్కంపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కొత్త వెంకటయ్యను నియమించడం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మహిపాల్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని నూతనంగా నియమితులైన అధ్యక్షులు కొత్త వెంకటయ్య ఆధ్వర్యంలో గ్రామంలో పార్టీ మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి అందరూ సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కొత్త వెంకటయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన మండల నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తానని, గ్రామంలో ప్రతి కార్యకర్తను కలుపుకుని ముందుకు వెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జక్కపల్లి బిసిసిసిఎల్ అధ్యక్షులు అమృతప్ప, తాండూర్ మార్కెట్ కమిటీ మాజీ ఎయంసి డైరెక్టర్ రాజు, సంగం హనుమంతు, యాలాల మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమన్న, చెన్నారం పవన్ రెడ్డి, అగనూర్ శ్రీధర్, తిమ్మాయిపల్లి సర్పంచ్ అమర్నాథ్ రెడ్డి, జక్కేపల్లి మాజీ ఉప సర్పంచ్ రాంచందర్, మాజీ ఎంపీటీసీ కొత్త మాణిక్యమ్మ, మల్లప్ప, అక్కంపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అన్ని వయసుల వారికీ 'ఫిజికల్ లిటరసీ'

**రంగారెడ్డి, ఆగస్టు 22 (జనం సాక్షి):** తెలంగాణలో అన్ని వయస్సుల ప్రజలకు 100 శాతం 'ఫిజికల్ లిటరసీ' అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కిషోర్ గోపీనాథన్ తెలిపారు. క్రీడలను కేవలం యువతకే పరిమితం చేయకుండా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరిలో శారీరక చైతన్యం, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పెంపొందించడమే ఉద్దేశమన్నారు. జిల్లా స్థాయిలో ఫిజికల్ లిటరసీ కార్యక్రమాల అమలుపై యంగ్ ఇండియా వర్సిటీ ఆధ్వర్యంలో, ఇంటర్నేషనల్ ఫిజికల్ లిటరసీ అసోసియేషన్ సహకారంతో శనివారం రాష్ట్రస్థాయి వర్చువల్ ఓరియంటేషన్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషోర్ గోపీనాథన్ మాట్లాడుతూ ఆధునిక క్రీడలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించడం ద్వారా ప్రజల్లో శారీరక చైతన్యాన్ని పెంచాలని సూచించారు.

ఫిజికల్ లిటరసీని అంతర్జాతీయ స్థాయిలో విస్తరించేందుకు ప్రముఖ సంస్థ ఐపీఎల్ఏతో తమ వర్సిటీ భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ప్రతి జిల్లాలో యువజన, క్రీడల అధికారులు క్షేత్రస్థాయిలో కార్యక్రమాలను రూపొందించి అమలు చేయాలని సూచించారు. జిల్లా స్థాయి కోఆర్డినేటర్లు కలెక్టర్, సామాజిక సంస్థలతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు.

అసోసియేషన్ గవర్నెన్స్ అండ్ హెచ్ఆర్ ప్రతినిధి అమిత్ మాలిక్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 50 దేశాలు ఫిజికల్ లిటరసీ కార్యక్రమాన్ని స్వీకరించాయని తెలిపారు. ఇది కేవలం క్రీడలకు మాత్రమే పరిమితమైన కార్యక్రమం కాదని, శరీరం, మనస్సు, భావోద్వేగాల సమన్వయంతో ఆరోగ్యకరమైన జీవనానికి పునాది వేస్తుందని వివరించారు. అన్ని వయస్సుల వారు ప్రతిరోజూ చురుకుగా ఉండేలా ప్రోత్సహించడం దీని ప్రధాన ఉద్దేశమన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్. స్వర్ణలత, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామారావు, సీడీపీఓ జి. శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే జీవో 97ను రద్దు చేయాలి

ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వంశీ వర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం పాలిటెక్నిక్, డిప్లమా కోర్సులు పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్యను అందిస్తున్న ముఖ్యమైన మార్గమని అన్నారు. ముఖ్యంగా గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థులు ఈ కోర్సులపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. వ్యవస్థలో మార్పుల కారణంగా భవిష్యత్తులో విద్యా రుసుములు, ఇతర ఖర్చులు పెరిగితే ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఇప్పటికే తక్కువ ఖర్చుతో లభించే విద్యావకాశాలపై ఆధారపడుతున్న విద్యార్థులు అధిక ఫీజులు భరించలేరని వంశీ వర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో కొందరు విద్యను మధ్యలోనే నిలిపివేసే ప్రమాదం ఉందన్నారు. విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావాల్సిన ప్రభుత్వం పేద విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం పడే నిర్ణయాలు తీసుకోవడం సరికాదని అన్నారు. పాలిటెక్నిక్, డిప్లమా విద్య ద్వారా విద్యార్థులకు ఉన్నత విద్యతోపాటు వివిధ సాంకేతిక రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు.

కోర్సుల నిర్మాణంలో మార్పులు, విద్యా వ్యవస్థలో అనిశ్చితి విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపకుండా ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. జీవో 97పై సమగ్ర సమీక్ష నిర్వహించి విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలు, పాలిటెక్నిక్, డిప్లమా విద్యార్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.



పేద విద్యార్థులకు అందుబాటులో ఉన్న సాంకేతిక విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వారిపై అదనపు ఆర్థిక భారం పడకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.

జీవో 97ను తక్షణమే ఉపసంహరించుకుని విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల ప్రయోజనాల కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల సమస్యలను కూనంనేని సాంబశివరావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి విద్యార్థులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా గర్ల్స్ కన్వీనర్ శ్రావణి, జిల్లా సహాయ కార్యదర్శి చింత వెంకటేష్, మండల కార్యవర్గ సభ్యుడు చందు, ఏఐఎస్ఎఫ్ నాయకుడు నిఖిల్‌తోపాటు పలువురు పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.




## 'క్యాన్ డూ' వర్క్‌షాప్‌లో జెడ్పీహెచ్ఎస్ బాలికల ప్రతిభ

**అల్వాల్, ఆగస్టు 22(జనంసాక్షి):** ఉల్లాస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన 18వ వార్షిక 'క్యాన్ డూ' వర్క్‌షాప్--2026లో అల్వాల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. 9వ తరగతికి చెందిన ఎస్. మౌనిక, సీహెచ్. ప్రసన్న, సంకసర్ల సాత్విక, బిందు ప్రియ, లక్ష్మి దుర్గ, జైనబ్ ఖాతూన్ వర్క్‌షాప్‌లో పాల్గొని ధ్రువపత్రాలు అందుకున్నారు. 'ఇఫ్ యూ డ్రీమ్ ఇట్, యూ కెన్ డూ ఇట్!' అనే స్ఫూర్తిదాయక సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను పెంపొందించేలా వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. జాతీయ స్థాయి కార్యక్రమంలో తమ పాఠశాల బాలికలు పాల్గొని ధ్రువపత్రాలు అందుకోవడం పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## వికలాంగులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

**మేనిఫెస్టో హామీలు తక్షణమే అమలు చేయాలి : దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**



**ఎల్బీనగర్ ఆగస్టు 22 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి, దివ్యాంగులకు న్యాయం చేయాలని ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆయన విమర్శించారు. ఈ మేరకు వికలాంగుల సంస్థల జాతీయ నెట్‌వర్క్ ఎన్‌పీడీఓ ఆధ్వర్యంలో వికలాంగులతో ఎల్.బి.నగర్‌లోని దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారి శిబిర కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు తదితర అంశాలపై చర్చించారు. వికలాంగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని, వారి సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఎన్నికల హామీల అమలులో జాప్యం చేయకుండా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.
ఈ కార్యక్రమంలో పలువురు వికలాంగులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులను కాపాడండి.. పాఠశాలలను రక్షించండి

- ఉప్పల్ రింగ్ రోడ్డుపై ఉపాధ్యాయుల భారీ ర్యాలీ
- నల్గొండ ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యను తీవ్రంగా ఖండన
- విద్యాసంస్థల్లో భద్రతా చర్యలు బలోపేతం చేయాలని డిమాండ్
- ఉపాధ్యాయులపై దాడులకు అడ్డుకట్ట వేసేలా కఠిన చట్టాలు తేవాలని విజ్ఞప్తి




**ఉప్పల్, ఆగస్టు 22 (జనం సాక్షి):** ఉపాధ్యాయులు, పాఠశాలల భద్రతకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ యునైటెడ్ స్కూల్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శనివారం ఉప్పల్ రింగ్ రోడ్డుపై భారీ ర్యాలీ నిర్వహించారు. 'ఉపాధ్యా యులను కాపాడండి.. పాఠశాలను కాపాడండి' అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. నల్గొండ ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యను తీవ్రంగా ఖండించిన వారు, విధి నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయులు, విద్యాసంస్థల సిబ్బందికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. రూపారెడ్డి హత్య విద్యా రంగంలో తీవ్ర ఆందోళన కలిగించిందని నిరసనకారులు పేర్కొన్నారు. పాఠశాలలో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు, సిబ్బందికి భద్రత లేకపోతే వారు ప్రశాంతంగా విద్యాబోధన ఎలా చేయగలరని ప్రశ్నించారు. ఘటనకు బాధ్యులైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబ సభ్యులకు సంఘీభావం తెలిపారు.
పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, సిబ్బందికి రక్షణ కల్పించేలా ప్రత్యేక భద్రతా విధానాన్ని రూపొందించాలని కోరారు. విద్యాసంస్థల ఆవరణలోకి అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని నియంత్రించాలని, పాఠశాలల వద్ద భద్రతా చర్యలను బలోపేతం చేయాలని సూచించారు. ఉపాధ్యాయులపై బెదిరింపులు, దాడులు, వేధింపులు జరిగినప్పుడు వెంటనే స్పందించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యాసంస్థలు విద్యార్థులకు సురక్షితమైన వాతావరణాన్ని అందించాల్సిన ప్రదేశాలని, అందులో పనిచేసే ప్రతి ఒక్కరికీ భద్రత ఉండాలని ఉపాధ్యాయులు అన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాల మధ్య సమన్వయంతో భద్రతా విధానాలను అమలు చేయాలని కోరారు. సమస్యలు తలెత్తినప్పుడు ఫిర్యాదు చేసేందుకు, తక్షణ సహాయం పొందేందుకు స్పష్టమైన వ్యవస్థ ఉండాలని సూచించారు.
ఉపాధ్యాయులు, విద్యాసంస్థలపై దాడులను అరికట్టేందుకు కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడులకు పాల్పడే వారిపై వేగంగా కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకునేలా ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించాలని కోరారు. ఉపాధ్యాయుల భద్రతను విద్యా విధానంలో కీలక అంశంగా పరిగణించి పాఠశాలల భద్రతపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు భయాందోళనలు లేకుండా విధులు నిర్వహించే వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. అవసరమైతే ఉపాధ్యాయుల భద్రత, పాఠశాలల రక్షణ కోసం ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని ఫోరమ్ ప్రతినిధులు స్పష్టం చేశారు. ర్యాలీలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని తమ డిమాండ్లను నినాదాల రూపంలో వినిపించారు.

## ప్రజలకు మంచి నీరు అందించడమే లక్ష్యం

**సర్పంచ్ బీస కవిత కరుణాకర్ రెడ్డి**



**కేశంపేట, ఆగస్టు 22(జనం సాక్షి) :** గ్రామంలోని ప్రజలకు స్వచ్ఛమైన మంచి నీటిని అందించడమే హర్ ఘర్ జల్ కార్యక్రమ లక్ష్యమని సర్పంచ్ బీస కవితా కరుణాకర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హర్ ఘర్ జల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో మహిళలు నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఇచ్చి స్వచ్ఛమైన త్రాగునీటిని అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నరేష్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి అవినాష్ గౌడ్ , జిపిఓ కృష్ణయ్య, వార్డు సభ్యులు పోగుల నర్సింలు, నరేష్, లచ్చిరాం నాయక్, నాగిళ్ల ప్రేమలత యాదయ్య, కందెన సంతోష శివయ్య, గ్రామస్తులు గుత్తి శేఖర్, లాలమోని పాండు , శంభుల శేఖర్, వెంకటయ్య, గోస్కే కృష్ణయ్య, కానుగుల వెంకటయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

## యాచారం రైతుల పోరాటానికి యోగేంద్ర యాదవ్ మద్దతు

**యాచారం, ఆగష్టు 22(జనం సాక్షి)**
ఫార్మా/ఫ్యూచర్ సిటీ పేరుతో యాచారం మండల రైతులకు జరుగుతున్న అన్యాయాలపై స్వరాజ్ ఇండియా జాతీయ అధ్యక్షులు శ్రీ యోగేంద్ర యాదవ్ తీవ్రంగా స్పందించారు. శనివారం యాచారం రైతు ప్రతినిధులు ఆయనను కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న బలవంతపు భూసేకరణను వివరించారు. ఎన్నికల ముందు మాట ఇచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు పోలీసులతో భయభ్రాంతులకు గురిచేస్తూ చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు రైతు బాధితులు ఆయనకు వినతిపత్రంతో పాటు, జులై 5న తాటిపర్తిలో జరిగిన ప్రజా అభిప్రాయ సేకరణ నివేదికను అందజేశారు.

# దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్‌కు పునర్నిర్మాణం

- బీరప్పగడ్డ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో పనులు ప్రారంభం
- వర్షపు నీటితో సీవరేజ్ ఓవర్‌ఫ్లోకు అడ్డుకట్ట
- వాటర్ వర్క్స్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లిన బన్నాల
- దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్ వివరాలు తెలియజేయాలని స్థానికులకు పిలుపు



**ఉప్పల్/బీరప్పగడ్డ, ఆగస్టు 22 (జనం సాక్షి):** బీరప్పగడ్డ డివిజన్‌లో దెబ్బతిన్న సీవరేజ్ మ్యాన్‌హోల్స్‌ను గుర్తించి పునర్నిర్మించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ కార్పొరేటర్ బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ కోరారు. డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీల్లో మ్యాన్‌హోల్స్ దెబ్బతినడంతో వర్షపు నీరు సీవరేజ్ లైన్లలోకి చేరి మురుగు నీరు ఓవర్‌ఫ్లో అవుతున్న విషయాన్ని వాటర్ వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వర్షాలు కురిసిన సమయంలో దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్ ద్వారా భారీగా వర్షపు నీరు సీవరేజ్ వ్యవస్థలోకి చేరడంతో మురుగు నీరు రోడ్లపైకి వస్తోందని బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ వాటర్ వర్క్స్ జీఎం సంతోష్‌కు వివరించారు. దీంతో పారిశుధ్య సమస్యలతోపాటు స్థానికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో సీవరేజ్ లైన్లను పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. సమస్యపై స్పందించిన వాటర్ వర్క్స్ అధికారులు సిబ్బందితో కలిసి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్‌ను పరిశీలించారు. కళ్యాణ పురి, రాఘవేంద్రనగర్, బ్యాంక్ కాలనీ, ధర్మపురి కాలనీతోపాటు బీరప్పగడ్డలోని పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్‌ను గుర్తించి పునర్నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో వర్షాకాలంలో సీవరేజ్ ఓవర్‌ఫ్లో సమస్య కొంతమేర తగ్గే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు. డివిజన్‌లో ప్రజలకు ఇబ్బందులు కలిగించే మౌలిక వసతుల సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ పేర్కొన్నారు. సీవరేజ్, తాగునీరు, రోడ్లు, పారిశుధ్య సమస్యలను స్థానికులు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. మిగిలిన ప్రాంతాల్లోనూ దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్‌ను గుర్తించి త్వరితగతిన పునర్నిర్మించాలని స్థానికులు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ అధికారులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఏదుళ్ల కొండల్‌రెడ్డి, రామాంజనేయులు, శ్యామ్, కళ్యాణపురి అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్, సభ్యుడు గణేష్‌తోపాటు వివిధ కాలనీల అధ్యక్షులు, కార్యదర్శులు, కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## బీజేపీ హైకోర్టు కాలనీ డివిజన్ అధ్యక్షునిగా మర్రి మధుసూదన్ రెడ్డి



**హయత్ నగర్, ఆగస్టు 22 (జనం సాక్షి) :** భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన, హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డ సమక్షంలో రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయంలో పలు నూతన నియామకాలు చేపట్టారు. ఈ సందర్భంగా హైకోర్టు కాలనీ డివిజన్ నూతన అధ్యక్షునిగా మర్రి మధుసూదన్ రెడ్డి ని నియమిస్తూ వారికి నియామక పత్రాన్ని అందజేశారు. జిల్లా సహాయ కార్యదర్శిగా సిరంగి సురేష్ కుమార్, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలిగా పార్వతి, జిల్లా ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యునిగా గంగాని రాము, జిల్లా కార్యవర్గ సభ్యునిగా ప్రేమ్ చంద్ లకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులను సత్కరించి, వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతలు స్వీకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిలు బండారి భాస్కర్, యశ్పాల్ గౌడ్, హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, ఉమ్మడి హయత్ నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి, మహిళా మోర్చా అధ్యక్షురాలు గీత, నాయకులు సైదమ్మా, వెంకన్న, లింగ రెడ్డి, లక్ష్మణ్, వెంకన్న, జంగా రెడ్డి, తిరుమలేష్, రాజా శేఖర్, దామోదర్ రెడ్డి, యాదయ్య, విష్ణు, రీతిక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటరుకు అవకాశం ఇవ్వాలి

- మొయినాబాద్ తహసీల్దార్ గౌత మ్ కుమార్
- బిఎల్వోలకు అవగాహన సదస్సు



**మొయినాబాద్ ఆగస్టు 22 జనం సాక్షి :** గ్రామాలలో ప్రతి ఒటరుకు అవకాశం కల్పించాలని క్షేత్రస్థాయి సిబ్బంది తమ పరిధిలోని సర్ ప్రక్రియను నిర్వహించాలని మొయినాబాద్ మండల తహసీల్దార్ గౌతమ్ కుమార్ సూచించారు. శనివారం మొయినాబాద్ మండల రైతు వేదికలో తహసీల్దార్ గౌతమ్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్ అవ గాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయి సిబ్బంది తమ పరిధిలోని సర్ ప్రక్రియను సమన్వయంతో నిర్వహిస్తు అర్హత కలిగిన ప్రతి ఒటరుకు అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. డ్రాఫ్ట్ ఎలక్ట్రోల్ ప్రచురణ అనంతరం చేపట్టవలసిన చర్యలపై ఓటర్లకు నోటీసుల జారీ, ఫిర్యాదులు, అభ్యంతరాలను స్వీకరించాలని, విచారణ ప్రక్రియ బిఎల్వో యాప్ వివరాల నమోదు వంటి అంశాలపై సిబ్బందికి సమగ్రంగా వివరించాలని తెలిపారు. డ్రాఫ్ట్ రోల్పైన ఫిర్యాదులు, అభ్యంతరాలను సెప్టెంబర్ 16వ తేదీ వరకు సమర్పించాలని పేర్కొన్నారు. ఫామ్-6, 7, 8పై సూచనలను వివరించారు. జూలై 1, 1987 వరకు ముందు భారత దేశంలో జన్మించిన వారు తమ పుట్టిన తేదీ, పుట్టిన స్థలాన్ని నిర్ధారించే అవసరమైన పత్రాలలో ఏదైనా ఒక దానిని సమర్పించాలని అన్నారు. డిసెంబర్ 2, 2002 మధ్య భారతదేశంలో జన్మించిన వారు తమకు సంబంధించిన పత్రాలతో పాటు తండ్రి, తల్లికి సంబంధించిన అవసరమైన పత్రాన్ని సమర్పించాలన్నారు. డిసెంబర్ 2, 2002 తరువాత జన్మించిన వారు తమకు సంబంధించిన పత్రాలతో పాటు తండ్రి, తల్లికి అవసరమైన పత్రాలను నిబంధనల ప్రకారం సమర్పించుకోవాలని పేర్కొన్నారు. మొయినాబాద్ మండలంలో మొత్తం 29,394 ఓటర్లు ఉండగా 23,994 ప్రస్తుతం డిజిలైజేషన్ అయినట్లు 81 శాతం అయిందని అన్నారు. మున్సిపల్ పరిధిలోని మొత్తం 32826 ఉండగా అందులో 24,665 75 శాతం డిజిలైజేషన్ అయినట్లు తెలిపారు. ఓటు రద్దైన ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా నోటీసులు ఇచ్చి వారి నుంచి సమాధానం తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ఆర్ఐ రాజేష్, బిఎల్ వోలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ నగరేశ్వర ఆలయ చైర్మన్‌గా రొంపల్లి సంతోష్ కుమార్‌కు అవకాశం కల్పించాలి

### కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు.



**తాండూరు అగస్టు 22(జనంసాక్షి) :** పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ నగరేశ్వర ఆలయ చైర్మన్ పదవికి రొంపల్లి సంతోష్ కుమార్‌కు అవకాశం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రొంపల్లి సంతోష్ కుమార్ ఎంతో కాలంగా ఆలయ అభివృద్ధికి, భక్తుల సేవకు కృషి చేస్తున్నారని తెలిపారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ లో చురుగ్గా పాల్గొంటూ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, బుయ్యని శ్రీనివాస్ రెడ్డిల మన్ననలు పొందుతున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో శాయాశక్తుల కృషి చేసి కౌన్సిలర్ గెలుపుకు కృషి చేశారు. ఆలయ అభివృద్ధిపై పూర్తి అవగాహన ఉన్న వ్యక్తి ఆయన అని, యువకుడు, సేవా దృక్పథం కలిగిన వ్యక్తిగా ఆలయానికి మరింత గుర్తింపు తీసుకువస్తారని అన్నారు. భక్తుల సౌకర్యాల కల్పన, ఆలయ ఆదాయ వృద్ధి, నిత్య పూజా కార్యక్రమాల నిర్వహణలో ఆయన సమర్థవంతంగా పని చేయగలరని కౌన్సిలర్లు అభిప్రాయపడ్డారు. కాబట్టి సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రొంపల్లి సంతోష్ కుమార్‌కు చైర్మన్‌గా అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## పంటలకు మెరుగైన ధర వచ్చే వరకు కోల్డ్ స్టోరేజ్‌లో భద్రపరచుకోవచ్చు



**చేవెళ్ల, ఆగస్టు 22 (జనంసాక్షి):** ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో చేవెళ్ల డివిజన్ రైతులకు కోల్డ్ స్టోరేజ్ రూమ్స్‌పై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా వికారాబాద్ జిల్లా పూడూరు మండలం చిట్టంపల్లి గ్రామంలో ఎకో ఫ్రాస్ట్ సంస్థ నిర్మించిన సౌర విద్యుత్‌తో నడిచే కోల్డ్ రూమ్‌ను రైతులు సందర్శించారు. పంట చేతికి వచ్చిన సమయంలో మార్కెట్‌లో ఆశించిన ధర లభించకపోతే, పంటను కోల్డ్ రూమ్స్‌లో రెండు నుంచి మూడు వారాల పాటు భద్రపరిచి, ధరలు పెరిగిన అనంతరం మార్కెట్‌కు తరలించే అవకాశం ఉంటుందని అధికారులు రైతులకు వివరించారు. క్షేత్రస్థాయిలో రైతుల అవసరాలకు అనుగుణంగా 2, 5, 10 టన్నుల సామర్థ్యం కలిగిన కోల్డ్ రూమ్స్‌తో పాటు వాణిజ్య అవసరాల కోసం పెద్ద సామర్థ్యం గల కోల్డ్ స్టోరేజ్ నిర్మాణాలను కూడా ఎకో ఫ్రాస్ట్ సంస్థ ఏర్పాటు చేసి ఇవ్వగలదని తెలిపారు. పెద్ద వాణిజ్య కోల్డ్ స్టోరేజ్ నిర్మాణాలకు ప్రభుత్వం 35 శాతం రాయితీ అందిస్తుందని అధికారులు పేర్కొన్నారు. కోల్డ్ స్టోరేజ్ సదుపాయాలను వినియోగించుకోవడం ద్వారా పంటలను తక్కువ ధరలకు అమ్మకుండా, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా విక్రయించి రైతులు మెరుగైన ఆదాయం పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఉద్యాన అధికారి కీర్తి కృష్ణ, ఉద్యాన విస్తరణ అధికారి నర్సింలు, ఎకో ఫ్రాస్ట్ రీజినల్ మేనేజర్ చాంద్ పాషా, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఎన్‌జీఓ మేనేజర్ రత్నాకర్, రైతులు మాణిక్యం, అమృత రాజు, శివ, సృజయ్, శ్యామల, బుచ్చయ్య పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలకు దూరంగా.. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**విద్యార్థులకు మోమిన్‌పేట్ పోలీసుల అవగాహన**

**బాల్య వివాహాలు, బాల నేరాలపై చట్టపరమైన అంశాల వివరణ**



మోమిన్‌పేట్, ఆగస్టు 22 (జనం సాక్షి): విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండడంతో పాటు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మోమిన్‌పేట్ ఎస్ఐ జి. భరత్ భూషణ్ సూచించారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఆదేశాల మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మోమిన్‌పేట్ పోలీసుల ఆధ్వర్యంలో 'నషాముక్త్' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, బాల్య వివాహాలు, బాల నేరాలు, సైబర్ భద్రత, బాధ్యతాయుత ప్రవర్తనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఎస్ఐ తెలిపారు. విద్యార్థులు చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు సంబంధించిన కార్యకలాపాలు తమ దృష్టికి వస్తే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. చిన్న వయస్సులో చెడు అలవాట్లకు బానిసైతే భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉందని, క్రమశిక్షణతో విద్యపై దృష్టి సారించాలని పేర్కొన్నారు.

బాల్య వివాహాల వల్ల ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలను కూడా వివరించారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండి, విద్యను కొనసాగిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. అదే విధంగా నేరాలు, హింస, దొంగతనాలు, మాదకద్రవ్యాల వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే ఎదురయ్యే పరిణామాలను వివరించి, మంచి స్నేహితులను ఎంచుకోవాలని సూచించారు. ఇటీవల జరిగిన ప్రిన్సిపాల్ రూపారెడ్డి కేసు దర్యాప్తులో బాల నేరస్థుల ప్రమేయం ఉన్న నేపథ్యంలో బాల నేరాలపై కూడా విద్యార్థులకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చారు. చెడు ప్రభావాలకు లోనుకాకుండా సమస్యలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు.

విద్యార్థులు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని, మాదకద్రవ్య రహిత, సైబర్ సురక్షిత, బాలల స్నేహపూర్వక, నేర రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించాలని మోమిన్‌పేట్ పోలీసులు కోరారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## చేవెళ్ల మోడల్ స్కూల్ నూతన ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా అజ్రాన

**చేవెళ్ల, ఆగస్టు 22 (జనంసాక్షి)**

చేవెళ్ల తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల నూతన ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా పీజీటీ సివిక్స్ ఉపాధ్యాయురాలు అజ్రాన అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన చిన్నపరెడ్డి పదవీ విరమణ చేయడంతో సీనియార్టీ ప్రాతిపదికన అజ్రానకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు నూతన ప్రిన్సిపాల్ అజ్రానను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల విద్యా ప్రగతి, క్రమశిక్షణ, భవిష్యత్ లక్ష్యాల సాధనకు అజ్రాన ప్రోత్సాహం అందిస్తారని విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన బాధ్యతలు స్వీకరించిన అజ్రానకు విద్యార్థులు అభినందనలు తెలియజేస్తూ, ఆమె నాయకత్వంలో మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

# ఉద్యోగుల పోరుబాట

- పీఆర్సీ, డీఏలు వెంటనే అమలు చేయాలి
- ఓపీఎస్ పునరుద్దరణకు ఉద్యోగుల డిమాండ్
- పెండింగ్ బిల్లులు చెల్లించి సమస్యలు పరిష్కరించాలి
- ఈ నెల 27న రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా
- సెప్టెంబర్ 10న మహాధర్నా

**రంగారెడ్డి, ఆగస్టు 22 (జనంసాక్షి) :** ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందో ళనలకు ఉద్యోగ సంఘాలు సిద్ధమవుతున్నాయి. ప్రభుత్వం వెంటనే పీఆర్సీని అమలు చేయడంతో పాటు పెండింగ్ లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్దరించాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోగ్య కార్డుల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులను వెంటనే చేపట్టాలని, జీవో నంబర్ 25ను సవరించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. జీవో నంబర్ 90ను అమలు చేయడంతో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మి కులకు సంబంధించిన ఇతర పెండింగ్ సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**దశలవారీగా ఆందోళనలు..**

టీజీఈ జేఏసీ ప్రకటించిన కార్యాచరణ లో భాగంగా ఈ నెల 27న రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్లు ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. అనంతరం సెప్టెంబర్ 1న పెన్షనర్ విద్రోహ దినం సందర్భంగా రా ష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 10న 'చలో హైదరాబాద్' పేరుతో మహాధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

**పీఆర్సీని వెంటనే అమలు చేయాలి..**

ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా పీఆర్సీ అమలు కాకపోవడం, ఆరు డీఏలు పెండింగ్లో ఉండటం ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తికి కారణమవుతోందన్నారు. సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణపై ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులు, ఆరోగ్య పథకం సమస్యలను పరిష్కరించి ఆర్థిక ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు



**ఊటు యశ్వంత్**
**జిల్లా టీజీఈ జేఏసీ చైర్మన్**

**ఉద్యోగుల హక్కులను గుర్తించాలి..**

ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ డీఏలు, పీఆర్సీ, వివిధ బిల్లులను వెంటనే చెల్లించి ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని కోరారు. కుటుంబ, ఉద్యోగ బాధ్యతలతో సతమతమవుతున్న ఉద్యోగులపై అధికారుల వేధింపులు కూడా ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. లేకపోతే ఉద్యోగుల ఐక్యశక్తిని ప్రజాస్వామ్య పద్ధతిలో చూపిస్తామని హెచ్చరించారు.



**డాక్టర్ కే. రామారావు.**
**టీజీఈ జేఏసీ జిల్లా కన్వీనర్..**

# విద్యార్థులకు అండగా బందె రాజేందర్ రెడ్డి అభిమానులు

- జన్మదిన వేడుకల సందర్భంగా అన్నదానం, పరీక్ష సామగ్రి పంపిణీ
- కురుమిద్ద పాఠశాలలో బందె రాజేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు
- ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ



**యాచారం , ఆగస్టు 22 (జనం సాక్షి ) :** విద్యార్థుల విద్యాభివృద్ధికి, పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ పిలుపునిచ్చారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడి చదివే తత్వం అలవర్చుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆయన అన్నారు. శనివారం యాచారం మండల పరిధిలోని కురుమిద్ద గ్రామ మాజీ వార్డు సభ్యులు బందె రాజేందర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన అభిమానుల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ,విద్యార్థులకు అన్నదానం చేశారు. పదో తరగతి విద్యార్థులకు హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ చేతుల మీదుగా పరీక్ష ప్యాడ్లు, పరీక్షా సామగ్రి, నోట్‌బుక్‌లను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు ఎంతో కీలకమైనవని, భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకునేలా విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. పరీక్షలను ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని, సమయపాలన పాటిస్తూ ప్రతి సబ్జెక్టుపై సమగ్ర అవగాహన పెంచుకోవాలని అన్నారు. సెల్ ఫోన్లకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా కొనసాగాలని ఆకాంక్షించారు. బందె రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలోని పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. ప్రతి సంవత్సరం పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన విధ్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకుని గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకలను విద్యార్థుల మధ్య సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సునీల్ కుమార్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అచ్యుత్ రెడ్డి, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు స్వప్న, శ్రీనివాస్, అశోక్, రాణి, వీరమణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. అలాగే బందె రాజేందర్ రెడ్డి అభిమానులు పంది శ్రీను, గోపలి మహేందర్, గోపలి పవన్ కుమార్, పంది వెంకటేష్, మంద డేవిడ్, పంది అరవింద్, బాబురావు, కోటేశ్, యశ్వంత్, నాని తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# సొంత నిధులతో ఆలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణం

**చేవెళ్ల, ఆగస్టు 22 (జనంసాక్షి) :** చేవెళ్ల మండలంలోని కమ్మెట గ్రామానికి చెందిన 8వ వార్డు సభ్యురాలు మీనా దశరథ్ తన సొంత నిధులతో భూలక్ష్మీమ్మ దేవాలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రజల మన్ననలు పొందారు. శనివారం గ్రామ సర్పంచ్ పద్మకృష్ణగౌడ్, మాజీ సర్పంచులు పట్లోళ్ల హన్మంత్‌రెడ్డి, రాంచంద్రయ్య, పెం టయ్య, మాజీ ఎంపీటీసీ జంగయ్య, ఉప సర్పంచ్ విష్ణు, వార్డు సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో సీసీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. వార్డు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మీనా దశరథ్ తన సొంత నిధులు రూ.2 లక్షలు వెచ్చించి భూలక్ష్మీమ్మ దేవాలయం చుట్టూ సీసీ రోడ్డు నిర్మించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. చిన్న వయస్సులోనే ప్రజలకు సేవ చేయాలనే తపనతో ముందుకు సాగుతున్న మీనా దశరథ్‌ను గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. భూలక్ష్మీమ్మ అమ్మవారి ఆశీస్సులు మీనా దశరథ్‌పై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఇదే స్ఫూర్తితో ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పత్తికుంట చెరువును పరిశీలించిన జోనల్ కమిషనర్




**రాజేంద్రనగర్,ఆగస్టు22(జనంసాక్షి) :** సెప్టెంబర్ 14 నుంచి 25 వరకు జరగనున్న గణేష్ ఉత్సవాలు, నిమజ్జనాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి శనివారం రాజేంద్రనగర్ పత్తికుంట చెరువును సందర్శించారు. నిమజ్జన సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పత్తికుంట పరిసరాల్లో అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీ బి.సురేందర్ రెడ్డి, ఎస్ఈ నరేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# జగన్మాత లలితా త్రిపుర సుందరి దేవి అనుగ్రహం దేశ ప్రజలందరిపై ఉండాలి

## తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



**ఖైరతాబాద్, ఆగస్టు 22 (జనం సాక్షి) :** జగన్మాత లలితా త్రిపుర సుందరి దేవి అనుగ్రహం భక్తులు, దేశ ప్రజలందరిపై ఉండాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆకాంక్షించారు.శనివారం శ్రీనగర్ కాలనీలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో నిర్వహించిన“శ్రీవిద్యా కోటి కుంకుమార్చన మహాయజ్ఞం”లో గవర్నర్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. భారతీ య మహిళలు కుంకుమార్చన వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం సనా తన సంప్రదాయాల గొప్పతనానికి ప్రతీక అన్నారు. భారతదేశ పురోగతి, లోకకల్యాణం, విశ్వశాంతిని ఆకాంక్షిస్తూ నిర్వహిస్తున్న ఈ మహాయజ్ఞం ద్వారా జగన్మాత లలితా త్రిపుర సుందరి దేవి కృపాకటా క్షాలు దేశ ప్రజలు, భక్తులందరిపై ప్రసరించాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక గురువు స్వామి అభి షేక్ బ్రహ్మచారి మహారాజ్ మాట్లాడుతూ దేశ పురోగతి, అభివృద్ధి కోసం భారత ప్రభుత్వానికి మరింత శక్తిని ప్రసాదించాలని మాత లలితా త్రిపు ర సుందరిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రధానమం త్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 2014 తర్వాత భారతదేశం ప్రపంచ వేదికపై గణనీయమైన పురో గతి సాధించి అంతర్జాతీయంగా గొప్ప గుర్తింపు పొందిందని పేర్కొన్నారు.భారతదేశ అభివృద్ధి, లోకకల్యాణం, విశ్వశాంతి, అణగారిన వర్గాల అభ్యున్నతి, ప్రజల సుఖశాంతులు, శ్రేయస్సును ఆకాంక్షిస్తూ ఈ మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.రెండు రోజుల పాటు జరిగే ఈ మహాయజ్ఞంలో లలితా సహస్రనామాన్ని కోటి సార్లు పారాయణం చేయడంతో పాటు సువా సినీ స్త్రీలతో కలిసి మహా కుంకుమార్చన నిర్వహిం చనున్నారు. అమ్మవారికి కోటి సంఖ్యలో కుంకు మతో అర్చనలు చేయడం యజ్ఞంలోని ప్రధాన క్రతువుగా నిర్వాహకులు తెలిపారు.వారణాసికి చెందిన ఆధ్యాత్మిక గురువు స్వామి అభిషేక్ బ్రహ్మచారి మహారాజ్ ఆధ్వర్యంలో జగన్మాత లలితా త్రిపుర సుందరి దేవి అనుగ్రహం, లోకకల్యా ణం, అఖండ భారత్ సాధనను ఆకాంక్షిస్తూ దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నా రు. ఇప్పటి వరకు దేశంలోని వివిధ ప్రాంతాల్లో 57 మహాయజ్ఞాలు నిర్వహించగా, హైదరాబాద్ శ్రీనగర్ కాలనీలో నిర్వహించిన మహాయజ్ఞం 58వదిగా నిర్వాహకులు తెలిపారు.యువ చేతన జాతీయ కన్వీనర్ రోహిత్ కుమార్ సింగ్ కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు.

# యోగ కేంద్రంగా అవేర్‌ను తీర్చిదిదుతాము

## అవేర్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తరుణ్

**మహేశ్వరం,ఆగస్టు22(జనంసాక్షి):** మహేశ్వరం మండలంలోని మొహబ్బత్ నగర్ గ్రామ సమీపంలో ఉన్న అవేర్ ను యోగ కేంద్రంగా తీర్చిదిద్దుతామని అవేర్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తరుణ్ అన్నారు.శనివారం మాధవన్ జీ హెల్త్ సిటీలో హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ సెంటర్ ను ప్రారంభించారు.ఈ సందర్బంగా ఎండీ తరుణ్ మాట్లాడుతూ…శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత ఆధ్యాత్మిక శ్రేయస్సు అందించాలనే లక్ష్యంతో మాధవన్ జీ ఇంటిగ్రేటెడ్ హెల్త్ సిటీ ప్రధాన లక్ష్యమన్నారు.350 పడకలతో మోడ్రన్ మెడిసిన్,కేరళ ఆయుర్వేదం, మైండ్ బాడీ వెల్ నెస్ కలిపిన సమగ్ర వైద్య కేంద్రాన్ని నిర్మిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో అవేర్ మాధవన్ జీ హాస్పటల్ డైరక్టర్ తన్వీ,జనరల్ మేనేజర్ గణేష్,అవేర్ సంస్థ కార్యనిర్వహణ అధికారి వెంకన్న,అవేర్ సంస్థ ప్రతినిధులు,డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# కొందుర్గు మండల టీఆర్‌పీ అధ్యక్షుడిగా దర్గా వెంకటయ్య నియామకం

## నియామక పత్రాన్ని అందజేసిన తీన్మార్ మల్లన్న



**కొందుర్గు,జనంసాక్షి:** తెలంగాణ రాజ్యాధికార పార్టీకొందుర్గు మండల అధ్యక్షుడిగా దర్గా వెంకటయ్య నియమితులయ్యారు. శనివారం పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ నియామక మహోత్సవంతో పాటు పార్టీలోకి చేరికలు జరిగాయి.ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. వెనుకబడిన తరగతుల (బిసిల) హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన మండల అధ్యక్షుడు దర్గా వెంకటయ్య మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ, బిసిల హక్కుల కోసం క్షేత్రస్థాయిలో పోరాడుతానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు బండారి రమేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు జనార్దన్ ముదిరాజ్ సమక్షంలో మీదికేరి రాధాకృష్ణ, వార్డు సభ్యులు కాశ యాదయ్య, మిద్దె ఎల్లరాజుతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు రాజ్యాధికార పార్టీలో చేరారు. వీరందరికీ తీన్మార్ మల్లన్న పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

# అంతాయిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం ఆటో ఏర్పాటు

## ఆటో డ్రైవర్ నాగరాజ్‌కు 8,000 రూపాయలు కిరాయి అందజేసిన జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి.



**శామీర్ పేట్, ఆగస్టు 22(జనం సాక్షి)** శామీర్‌పేట్ డివిజన్ అంతాయిపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభం అయిన సందర్భంగా,విద్యార్థుల రవాణా సమస్యను పరిష్కరించేందుకు జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అంతాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువు తున్న విద్యార్థులు బిట్స్ కాలనీ నుంచి అంతాయి పల్లి పాఠశాలకు ప్రతిరోజూ రావాల్సి ఉండగా, దూరం ఎక్కువగా ఉండటం వల్ల చిన్నారులు పాఠశాలకు చేరుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ విషయాన్ని గుర్తించిన జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి విద్యార్థుల విద్యకు ఎలాంటి ఆటంకం కలగ కూడదనే ఉద్దేశంతో వారి రాకపోకల కోసం ప్రత్యేకంగా ఆటోను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆటో నిర్వహణకు సంబంధించిన కిరాయిగా 8,000రూపాయలను ఆటో డ్రైవర్ నాగరాజ్‌కు జైపాల్ రెడ్డి అందజేశారు. విద్యార్థులు సకాలంలో సురక్షితంగా పాఠశాలకు చేరుకుని తమ విద్యను కొనసాగించాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల చదువుకు దూరం, రవాణా వంటి సమస్యలు అడ్డంకిగా మారకూడదు. చిన్నారులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలి. విద్యార్థుల సంక్షేమం కోసం అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటాను అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు అరుణకుమారి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కత్తి రమేష్ పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థుల రవాణా సౌకర్యం కోసం జైపాల్ రెడ్డి తీసుకున్న ఈ చొరవను స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.